క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై అవగాహన

మాడుగుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైస్ ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. జమ్మాదేవిపేటలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ పాల్గొని సంక్షేమ పథకాలు ఫ్లెక్సీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, వ్యవసాయాధికారి ఎం. వాసుదేవరావు, ఒమ్మలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బొద్దపు భాస్కరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

మాడుగుల రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల వేతనాల పెంపు, గ్రాట్యుటీ, పెన్షన్ అమలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు పి.చంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. తమ 11 డిమాండ్లు పరిష్కరించాలని ఐసీడీఎస్ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఎంపికలు

చీడికాడ: ఆడుదాం ఆంధ్రా పోటీలకు ప్రతి సచివాలయం నుంచి క్రీడాకారులను ఎంపిక చేయాలని ఎంపీడీవో కె. జయప్రకాష్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి సచివాలయం నుంచి 15 ఏళ్లు దాటిన 250 మంది బాలబాలికలను ఎంపిక చేయాలన్నారు. వివిధ క్రీడలకు సంబంధించి బాలురు 125 మంది, బాలికలు 125 మందిని ఎంపిక చేయాలని సూచించారు. గ్రామాల్లో పీఈటీల సారథ్యంలో త్వరతగతిని ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లేశ్వరరావు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్‌జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 24 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతి, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్య సహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు గడువు 9

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదుకు ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషనర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ నమోదు, మార్పులు చేర్పులపై బీఎల్వోలతో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5 తర్వాత పూర్తి ఓటర్ జాబితాను ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు.

పాఠశాల స్వర్ణోత్సవాలకు విరాళాల వెల్లువ

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 16, 17 తేదీల్లో జరుగనున్న స్వర్ణోత్సవాల నేపథ్యంలో పాఠశాల పూర్వ విద్యార్థులు ఒక్కరొక్కరుగా విరాళాలు ఇస్తున్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. 65వేలు అందజేసినట్లు స్వర్ణోత్సవ కమిటీ కోశాధికారి కృష్ణవర్మ తెలిపారు. అలాగే 1986–87 బ్యాచ్ విద్యార్థులు కూడా రూ. 13వేలు అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివరామచంద్రరాజు, శివాజీరాజు, భాస్కర్, లక్ష్మణాచారి, రామకృష్ణ, కృష్ణ, లోవరాజు, వర్మ, కాశీ, సత్యనారాయణ, మరిణిరాజు, లతీఫ్, శ్రీనివాస్, దత్తాత్రేయ, రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: కూందాంపేటలో కూలిన రైస్‌మిల్లు



రోలుగుంట: తడిచిన వరి పనలు ఒడ్డుకు చేర్చుతున్న చిన్నారి



నర్సీపట్నం: చెరువును తలపిస్తున్న ఆర్డీవో కార్యాలయ ఆవరణ



మాకవరపాలెం: జి.వెంకటాపురంలో వర్షానికి దెబ్బతిన్న పైకప్పు

జలమయం

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- పొలాల్లో నేలకొరిగిన వరి పంట
- ఇళ్లలోకి చేరిన వర్షం నీరు
- స్తంభించిన జనజీవనం



మాడుగుల రూరల్: కె.జె.పురంలో వరి పొలం లో నుంచి నీరు బయటకు పంపుతున్న రైతు

నర్సీపట్నం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నర్సీపట్నం జలమయమైంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్ర వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన కుండపోత వర్షానికి పట్టణంలోని ప్రధాన రోడ్డు జలమయమైంది. అబిద్‌సెంటర్ చెరువును తలపించింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణ పనులకు వర్షం ఆటంకం కలిగింది. డ్రైనేజీలో పూడిక పేరుకపోవడంతో కురిసిన వర్షం నీరు రోడ్లపై ఏరులై పారింది. చెత్తా చెదారంతో అవి అస్తవ్యస్తంగా మారాయి. ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రహదారిపై డ్రైనేజీ పొంగి ప్రవహించడంతో కార్యాలయానికి వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మెయిన్ రోడ్డుకు ఆనుకుని విత్తనాల దుకాణంలోకి వర్షపు నీరు భారీగా చేరింది. దీంతో దుకాణంలో విత్తనాలు, ఎరువులకు నష్టం కలిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, కమిషనర్ పూడి రవిబాబు సిబ్బందిని వెంటబెట్టుకుని డ్రైనేజీల్లో పూడిక తీయించి వర్షం నీరు నిల్వ లేకుండా సత్వర చర్యలు చేపట్టారు.



దేవరాపల్లిలో కురుస్తున్న భారీ వర్షం

డివిజన్‌లో 762 మిల్లీమీటర్ల వర్ష పాతం..

తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి డివిజన్ వ్యాప్తంగా ఎడతెగని వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. డివిజన్‌లో సగటున 762.4 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కోటవురట్ల మండలం 114.6 మి.మీ వర్షం కురిసింది. మండలాల వారీగా నాతవరం 45.4, గొలుగొండ 50.6, నర్సీపట్నం 103.8, రోలుగుంట 77.4, రావికమతం 53.2, మాడుగుల 42.6, చీడికాడ 36.8, మాకవరపాలెం 108.4, నక్కపల్లి 87.4, పాయకరావుపేట 10.8, ఎస్.రాయవరం 31.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

దేవరాపల్లిలో 4 సెం.మీ వర్షపాతం

దేవరాపల్లి: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం స్తంభించింది. రోడ్లన్నీ వర్షపునీటితో జలమయం కావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యాయి. వెరసి దేవరాపల్లిలో మంగళవారం 4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షం ధాటికి నేలకొరిగిన వరి పంట...

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షం, గాలుల ధాటికి పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో వాటిని నిలబెట్టేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. వరి చేను పడిపోకుండా పొలంలో చేరిన నీటిని వెంటనే బయటకు పోయేలా చిన్నపాటి కాలువలు తీయాలని ఏవో వై. కాంతమ్మ, ఏఈవో ఎస్. కిరణ్‌కుమార్ మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. కుప్పలు పెట్టిన వరిలో మొలక వచ్చే సూచనలు కనిపిస్తే 10 కేజీల కళ్లు ఉప్పు, 20 కేజీల ఊక కలిపి వరి కుప్పలు మీద చల్లాలని సూచించారు.

పాక్షికంగా దెబ్బతిన్న పెంకుటిల్లు

గొలుగొండ: భారీ వర్షానికి జోగుంపేటలో కేలంగి దేముడుకు చెందిన పెంకుటిల్లు పాక్షికంగా కూలిపోయింది. ఒక గది పూర్తిగా, మరో గది పాక్షికంగా దెబ్బతింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రాణనష్టం తప్పింది. వీఆర్వో గోవర్ధన్ ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం అందిస్తామన్నారు. మరోవైపు ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తం అయ్యారు.

రోలుగుంట: మిచాంగ్ తుపాను ప్రభావంతో కోసిన వరి పంట తడిచి ముద్దయింది. కొన్ని గ్రామాల్లో ఈదురు గాలులకు నేలకొరిగింది. వడాలపాలెం, లగుడు కొత్తూరు, తదితర గ్రామాల్లో కోతకొచ్చిన వరి పంట నేలమట్టమైంది. కొవ్వూరు, అంట్లపాలెం తదితర గ్రామాల్లో రైతులు పంట సంరక్షణ చర్యలు చేపట్టారు. తడిచిన వరి పనలు సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులు చేపట్టారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి

పల్లపు, మెరక భూముల్లో నీరు పోయే మార్గం చేసుకోవాలని ఏవో ఎస్ విజయలక్ష్మి రైతులకు సూచించారు. కోసిన వరి పనలపై పొరలు, పొరలుగా ఉప్పు ద్రావణం చల్లాలన్నారు. వీటిని కుప్ప పెట్టుకున్నా, గింజ రంగు మారదన్నారు. మొలక రావడాన్ని అరికట్టవచ్చన్నారు. పంట నేలమట్టమైన పొలంలో నీటిని బటయకు పోయే మార్గం చేసుకొని వర్షం తగ్గిన వెంటనే మూడు, నాలుగు దుబ్బులు నిలబెట్టి ఒకే దుబ్బుగా కట్టి సంరక్షించుకోవాలన్నారు.

రావికమతం: తుఫాన్ కారణంగా మండలంలో సోమవారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. వర్షంతో పాటు గాలులు వీయడంతో కోత దశలో వరిపంట పలు గ్రామాల్లో నేలకొరిగిపోయింది. వరి వెన్నులు నీటిలో నానుతున్నాయి. రావికమతం, కొత్తకోట, కొమిర, టొండపూడి, మేడివాడ, చినపాచిల గ్రామాల్లో ఎక్కువగా పంట నేలకొరిగింది. కొత్తకోట, మేడివాడలో వరి పనలు పూర్తిగా వర్షానికి తడిసిపోయాయి. పడిపోయిన చేలను, వర్షానికి తడిసిన పనలను మంగళవారం వ్యవసాయాధికారి రూప పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

మాకవరపాలెం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న తుపాను వర్షానికి పలుచోట్ల వరిపంట నేలకొరిగింది. వర్షపు నీటికి బరువెక్కిన వరికంకులు గాలులకు నేలవాలాయి. మాకవరపాలెం, కొండలఅగ్రహారం, పి.పి.అగ్రహారం, జంగాలపల్లి, గిడుతూరు తోపాటు లోతట్టు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకుంది. దీంతో కోతదశకు వచ్చిన పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు.



నర్సీపట్నం: చెరువును తలపిస్తున్న అబిద్‌సెంటర్

అప్రమత్తమైన అధికారులు..

వర్షానికి జి.వెంకటాపురంలో గజ్జి గోవిందమ్మకు చెందిన పెంకుటిల్లు పైకప్పు దెబ్బతిని పెంకులు రాలిపోయాయి. ఏ క్షణంలోనైనా ఇల్లు కూలిపోతుందనే అనుమానంతో గోవిందమ్మ కుటుంబాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి సచివాలయ సిబ్బంది తరలించారు.

మాడుగుల రూరల్: మిచాంగ్ తుఫాన్ వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో ఇటీవల కోసిన వరి పంట పూర్తిగా తడిసి ముద్దయింది. కె.జె.పురంలో రైతులు మంగళవారం ఉదయం పొలంలో చేరిన వర్షపు నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ రూపంలో నష్టం చేకూర్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో కోసిన వరి పంట ఈదురు గాలులకు నేలకొరిగింది.

కె.కోటపాడులో 39.4 ఎం.ఎం వర్షపాతం

కె.కోటపాడు: మండల వ్యాప్తంగా మంగళవారం 39.4 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భారీ వర్షాలతోపాటు ఈదురు గాలులు వీయడంతో కె.కోటపాడు, చౌడువాడ, పొడుగుపాలెం, ఎ.భీమవరం తదితర గ్రామాల్లో చెరుకుతోటలు నెలకొరిగాయి. వీటితో పాటు కోత దశకు చేరుకున్న వరి పంట పొలాల్లో నేలకొరిగింది. ముంపు ప్రాంత గ్రామాలైన మల్లంపాలెం, బంటువారి కళ్లాలు, పొడుగుపాలెం, మురుగుపాలెంలో ప్రజలను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేస్తున్నారు. ముంపు ఎక్కువైన పరిస్థితిలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ జె.రమేష్ బాబు తెలిపారు.

చోడవరం: మండలంలో ఎడతెరిపిలేకుండా కుండపోతగా వర్షం కురిసింది. పక్వానికి వచ్చిన వరి పంట కంకెలు నేలవాలిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క పంట కాలువలన్నీ వర్షపునీటితో పొంగిపొర్లుతున్నాయి. బీఎన్ రోడ్డులో చోడవరం, గోవాడ, వెంకన్నపాలెం, గాం, దీగ్రామం ప్రాంతాల్లో వేసిన మొదటి లేయర్ సీసీ రోడ్డు ఈ వర్షాలకు దెబ్బతిని పెద్దగోతులు పడ్డాయి. దీంతో వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడ్డారు. పొలాల్లో నిలిచిపోయిన వర్షపునీటికి గట్లకు గడ్డికొట్టి కాలువల ద్వారా బయటకు పంపించేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని చోడవరం వ్యవసాయశాఖ సహాయక సంచాలకుడు రవీంద్రనాథ్ సూచించారు. పండిపోయిన వరి కంకెలను నిలబెట్టి దుబ్బులుగా కట్టాలన్నారు.



కూలిన టాయ్‌లెట్ వద్ద బాధితురాలు

బుచ్చెయ్యపేట: మండలంలో ఎడతెరిలేకుండా వర్షం కురసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వందలాది ఎకరాల వరిపొలాలు నేలకొరిగాయి. కూందాంపేటలో ఎస్.లక్ష్మీనారాయణకు చెందిన రైస్‌మిల్లు వర్షాలకు గోడలు నాని కూలిపోయింది. బేరా కొండమ్మకు చెందిన టాయ్‌లెట్ కూలిపోయింది.

మాకవరపాలేనికి రూ.32.48 కోట్ల లబ్ధి



మాకవరపాలెంలో బుక్‌లెట్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ఒక్క మాకవరపాలెం గ్రామ సంక్షేమానికే రూ.32.48 కోట్లు ఖర్చు చేసినట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ తెలిపారు. గత నెల 9వ తేదీ నుంచి మండలంలో ప్రారంభమైన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, నేతలతో కలసి ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు బుక్‌లెట్లను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, యూత్ జిల్లా కార్యదర్శి కన్నూరు నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సర్వేశ్వరరావు, నాయకులు జె.కె.రాజు, కాగిత బుజ్జి, చింతకాయల వాసు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

నాతవరం: రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించేందుకు కృషి చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మర్రిపాలెం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సర్పంచ్ మంకు రమణమ్మ సాంబమూర్తి అధ్యక్షతన సంక్షేమ, అభివృద్ధి పనుల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కొంతమందికే సంక్షేమ పథకాలు అందేవని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందరికీ అందుతున్నాయన్నారు. మరలా ఎమ్మెల్యేగా ఉమాశంకర్ గణేష్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం, మర్రిపాలెం ఉప సర్పంచ్‌లు కరక అప్పలరాజు, బండారు అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బవరపు వెంకునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉలబాల శ్రీనువాస్, పార్టీ మహిళా శాఖ మండలాధ్యక్షురాలు కా మిరెడ్డి లక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు మంకు సాంబమూర్తి, దేవాడ సత్యనారాయణ, రంభా రాంబాబు, పాలురాజు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

ఆపద్బంధు.. సీఎం సహాయ నిధి

చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే గణేష్



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఆపద్బంధుగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని ముగ్గురికి సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఇటీవల ఏలేరు కాలువలో పడి మృతి చెందిన నాతవరం మండలం ఎంబి.పట్నానికి చెందిన సుర్ల రమణకు రూ.2 లక్షలు, కరోనాతో చనిపోయిన వేములూరి చిట్టిబాబు కుటుంబానికి రూ.2 లక్షలు, నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన సిరసపల్లి వరహాలు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.35 వేలు అందజేశారు. ముగ్గురికి మొత్తం రూ.4.35 లక్షలను బాధిత కుటుంబాలకు అందజేశారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

నాతవరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎక్కడ ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ రెండు రోజులుగా నాతవరం కార్యాలయంలో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. తాండవ నదితోపాటు చెరువుల్లోకి లోతట్టు ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా ఎస్‌ఐ రామారావు ఆధ్వర్యంలో హెచ్చరికలు జారీ చేశారు. ప్రధానంగా పంటలు ఎక్కడా దెబ్బతినకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా తాగునీరు, నిత్యావసర సరకులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మాడుగుల రూరల్: తుఫాన్ ప్రభావంతో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇది 24 గంటల పాటు పనిచేస్తుందని తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు. మండలంలో సమాచారం కంట్రోల్ రూమ్ సిబ్బంది ఎప్పటికప్పుడు తీసుకుంటారన్నారు. నది పరివాహక ప్రాంతంలో ఉన్నవారు వాగులు, గెడ్డల్లో ఒంటరిగా దాటవద్దని సూచించారు. గ్రామాల్లో వీఆర్వోలు, వీఆర్‌ఏలను అప్రమత్తం చేస్తున్నారు.

మూడు రోజుల నుంచి 25.7 మిల్లీమీటర్ల వర్షపాతం

మాడుగుల: మండలంలో మూడు రోజుల నుంచి పడుతున్న వర్షానికి 26.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. ముందస్తు ప్రచారంతో కోసిన వరి చేలులో 90 శాతం కుప్పలు పెట్టడంతోపాటు నూర్పిడి చేశారన్నారు. దాదాపు 10 శాతం మాత్రమే కోసిన వరి పనలు తడిచాయన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, డీఎంహెచ్‌వో హేమంత్, యాత్ర పరిశీలకులు అనురాధ

అనకాపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో జన జాతీయ గౌరవ దినోత్సవం, వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండీ, సంక్షేమ పథకాలు అందని వ్యక్తులు ఉంటే సమీపంలోని ప్రభుత్వ అధికారులను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు 2024 క్యాలండర్‌ను సంకల్పయాత్ర కేంద్ర పరిశీలకులు డాక్టర్ అనురాధ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీడీవో కె.నరసింహారావు, వ్యవసాయశాఖ అధికారి రంగాచారి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణి జగదీశ్వరి, సర్పంచ్ శ్రీను, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

10న విజిల్ బ్లోయర్ చిత్ర ప్రదర్శన

సీతంపేట: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కుల అంశంపై రూపొందించిన 'విజిల్ బ్లోయర్'ఆంగ్ల చిత్రాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించనున్నట్టు వైజాగ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సినిమా తిలకించడానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు.

'ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి'



మాట్లాడుతున్న బాలగంగాధర్ తిలక్

అనకాపల్లిటౌన్: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పి.బాలగంగాధర్ తిలక్ డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలైతే సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని రద్దు చేసేవరకూ విధుల బహిష్కరణ, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. వివాదాలను పరిష్కరించే సివిల్ కోర్టు పరిధిని రద్దుచేసి రెవెన్యూ పరిధిలో పెట్టడం అన్యాయమన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కోశాధికారి కె.సందీప్, సీనియర్ న్యాయవాదులు పీఎస్ పట్నాయక్, ఎం.జగపతి, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధితులకు నగదు, నిత్యావసర సరకులు అందజేస్తున్న పార్టీ శ్రేణులు

మారేడుమిల్లి: మండలంలోని సున్నంపాడు పంచాయతీ పరిధిలోని తుర్రూరు గ్రామానికి చెందిన వలంటీర్ పల్లాల సోమిరెడ్డి పూరిల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సర్వం కోల్పోయి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. వీరికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చేయూత అందించారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బాధితులను పరామర్శించారు. రూ.12.500తోపాటు, రూ.7,500 విలువ చేసే నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం , శాశ్వత గృహ నిర్మాణం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హామీ ఇచ్చినట్టు తెలిపారు.